క్లుప్తంగా

నా పదవీ కాలం పూర్తయింది


మధురెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన పదవీకాలం పూర్తయిందని, ప్రస్తుతం తాను మాజీనని జ్ఞానాంబ వారి మధురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 మార్చి 24న మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించిందన్నారు. అప్పటినుంచి మార్కెట్ కమిటీ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తన పదవీకాలం ఈఏడాది మార్చి 24న ముగిసిందన్నారు. ప్రస్తుతం తాను మార్కెట్ కమిటీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని తెలిపారు. ఒక సామాన్యుడి జీవనం సాగిస్తున్నానని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

పోలేరమ్మ దేవతకు పొంగళ్లు


పొంగళ్లు పెడుతున్న మహిళలు

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో మూడు రోజుల గంగమ్మ తిరునాళ్లలో భాగంగా మంగళవారం పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి, గంగమ్మకు అంబళ్లు పోశారు. ఉదయం ఆరోగ్య ప్రదాయిని గంగమ్మ దేవతకు మహిళలు ఇంటింటి నుంచి అంబలి తీసుకువచ్చి గుడి వద్ద ఉంచిన పాత్రల్లో పోశారు. మధ్యాహ్నం పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు


కాలభైరవస్వామికి అభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కాలభైరవస్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు, ధూప, దీప నైవేద్య, హారతులు సమర్పించారు. అనంతరం కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయస్థూపం వరకు ప్రదక్షిణగా వెళ్లి ఆలయంలోకి కొలువు దీర్చారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సత్యవేడు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని కెనరా బ్యాంకు నూతన మేనేజర్ కుమార్ అన్నారు. మంగళవారం బ్యాంకు మేనేజరుగా బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యవేడు బ్యాంకుశాఖ రూ.73 కోట్లు టర్నోవర్ కలిగి ఉందన్నారు. బ్యాంకు పరిధిలో బంగారు రుణాలు 8.9 శాతం, గృహరుణాలు 8.5శాతం, వాహనాల రుణాలు 11.5 శాతం వడ్డీతో అందిస్తామని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోట నందూరు బ్రాంచ్ నుంచి ఇక్కడికి బదిలీ అయినట్లు తెలిపారు.

సింగిల్ విండో చైర్మన్ రాజీనామా


హరిబాబురెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవికి పి.హరిబాబురెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కో–ఆపరేటివ్ అధికారికి పంపారు. ఆయనతో పాటు ప్రిమెస్ కమిటీ సభ్యులు చెంగల్‌రాయులు, గిరిరెడ్డి కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

కేంద్రమంత్రిని కలిసిన చంద్రప్ప


రామ్మోహన్‌నాయుడుతో చంద్రప్ప

శ్రీకాళహస్తి: పౌర విమానాయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు.

బాబు ప్రమాణ స్వీకారానికి..



శ్రీకాళహస్తి: ఎన్టీఆర్ జిల్లా గన్నవరం సమీపంలో బుధవారం నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు పట్టణ టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. మంగళవారం ఇక్కడి నుంచి నాయకులు వెళ్లారు. కాసరం రమేష్ తదితరులు ఉన్నారు.

బాల్యాన్ని బడిలోనే గడపాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి


రేణిగుంట : చైతన్యపురం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: చిన్నారులు బాల్యాన్ని బడిలోనే గడపాలని డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్ అండ్ చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. దుకాణాలు. కర్మాగారాల్లో పనిచేయడం వల్ల చిన్నారులు తమ బాల్యాన్ని కోల్పోయి, అనారోగ్యం బారిన పడుతారని తెలిపారు. ఎవరైనా చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

రేణిగుంట: బాల కార్మిక వ్యవస్థ రహిత సమాజ నిర్మాణానికి పౌరులందరూ బాధ్యతగా కృషి చేయాలని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి కోరారు. అంతర్జాతీయ బాలకార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని మామండూరు, చైతన్యపురం, మల్లిమడుగు, గురవరాజుపల్లి, వెదుళ్లచెరువు గ్రామాల్లో బెంగుళూరు క్రై సంస్థ సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచాలని, బాలకార్మిక వ్యవస్థను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత వల్ల బాల కార్మిక వ్యవస్థ పెరుగుతోందని, చదువుతోనే పేదరిక సమాజంలో మార్పులు వస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో బొమ్మలు గీయించి ప్రతి ఒక్కరూ బడికి వెళ్లి చదువుకోవాలని కోరారు. ప్రగతి సిబ్బంది జయప్రకాష్, అంగన్‌వాడీ టీచర్ మధుమతి, సుజాత, వీవో లీడర్లు పాల్గొన్నారు.

చిన్నారులను బడిలో చేర్పించండి


కారణి గ్రామంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్లమురళితో కలసి గిరిజన కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

పంపిణీకి విద్యా కానుకలు సిద్ధం


జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలు

బుచ్చినాయుడుకండ్రిగ: రానున్నవిద్యా సంవత్సరానికి(2023–2024)గానూ పంపిణీ చేసేందుకు విద్యా కానుకలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరాయి. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 5, ప్రాథమికోన్నత–5. ప్రాథమిక పాఠశాలలు– 51, ఏకలవ్య ఎస్టీ మోడ్రన్ గురుకుల పాఠశాల ఉన్నాయి. ఇందులో 1 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు 3,838 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యా కానుల కింద విద్యార్థులకు 12,132 వేల పైగా పాఠ్య పుస్తకాలు అవసరం కానున్నాయి. ఇప్పటి వరకు 7,004 వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయి. బ్యాగులు, బూట్లు, సాక్స్, డిక్షనరీలు, రాగి జావ తాగటానికి స్టీల్ గ్లాసులు వచ్చాయి. యూనిఫాం, బెల్టులు, నోట్ పుస్తకాలు రాగా, బ్యాగు మాత్రం రావాల్సి ఉంది. ఎంఈఓ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం జూన్ 13 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. మొదటి రోజే మండలంలోని అన్ని పాఠశాలలవిద్యార్థులకు విద్యా కానులు అందజేయనున్నామన్నారు. ఇప్పటికే 90 శాతం విద్యా కానుకలు ఎమ్మార్సీకి వచ్చాయని, మరో వారం రోజుల్లోగా మిగిలినవి రానున్నాయని తెలిపారు.




యూనిఫాం, బెల్ట్స్, షూస్

వేడుకగా మాతమ్మ కొలుపు ప్రారంభం


ఆలయంలో భక్తుల సందడి, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో శ్రీ రేణుక మాత పరమేశ్వరిదేవి ఆలయ వార్షిక కొలుపు ఉత్సవాలు మంగళవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కాపుకట్టు కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో పలు దేవతా చిత్రాల విద్యుత్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి పుట్ట వద్ద రేణుక మాత పరమేశ్వరి కళా ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఏపీ హంస అసోసియేషన్ నూతన కార్యవర్గం


సుబ్రమణ్యం(అధ్యక్షుడు)

సత్యవేడు: ఏపీ హంస(ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సరీస్వసెస్ అసోసియేషన్) సత్యవేడు తాలుకా అధ్యక్షుడిగాఎన్.సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యశాల ప్రాంగణంలో తాలుకా సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రాజా, జిల్లా సెక్రటరీ టాటాబాయ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.సుబ్రమణ్యం(దాసుకుప్పం పీహెచ్‌సీ), వైస్ ప్రెసిడెంట్లుగా కె.శాంతి (చిన్నపాండూరు), ఎన్. కుమారి (నాగలాపురం), సెక్రటరీగా ఎస్.గవాస్కర్ (వరదయ్యపాళెం), ట్రెజరర్‌గా పి.కృష్ణారెడ్డి(సత్యవేడు), కార్యదర్శిగా సెబాస్టిన్(వరదయ్యపాళెం), మహిళా సెక్రటరీగా సహాయమేరి(దాసుకుప్పం), కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీదేవి(దాసుకుప్పం), జాయింట్ సెక్రటరీలుగా కె.సుమతి, డి.రోస్‌లిన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.వెంకటరమణ, టి.రేణుక, ఇంద్రాణి, ఏ.యమున, పి.షణ్ముగనాథ్, ఎస్.కామేశ్వరి ఎన్నికయ్యారు.

కండలేరులో 6.496 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.496 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈఏపీ సెట్‌లో ప్రతిభ

శ్రీకాళహస్తి: ఏపీ ఈఏపీ సెట్‌లో శ్రీకాళహస్తికి చెందిన నాగోలు యశ్వంత్‌కుమార్‌రెడ్డి ప్రతిభ చూపాడు. రాష్ట్రంలో 151 ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి సురేంద్రరెడ్డి శ్రీకాళహస్తి వ్యవసాయశాఖలో ఏవోగా పనిచేస్తున్నారు.

ముత్యాలమ్మకు పల్లకీ సేవ



చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు రకాల అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బంగారమ్మతల్లీ.. పాహిమాం





శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసి ఉన్న శ్రీబంగారమ్మ ఆలయ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ జలాలు, కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అంబలి పంపిణీ చేశారు. ఉదయం 9 గంటలకు గెరిగ ఉత్సవం ప్రారంభమైంది. వాయిద్యాలు, నృత్యాల సందడి నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మైలు ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు వేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – శ్రీకాళహస్తి

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంగళవారం సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లుతో కలసి ఆయన ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు జ్వరాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. డెంగీ, మలేరియా జ్వరాలు అనాఫిలస్ అనే దోమ నుంచి వ్యాపిస్తుందని తెలిపారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, రక్తహీనత వంటివి వస్తాయన్నారు. ఈ జ్వరాలు సోకకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలని, ఇంటి ద్వారాలకు, కిటికీలకు, మెష్‌లు బిగించాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఈ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లను అధిగమించాలి

రేణిగుంట: కిషోర బాలికలు వయస్సు రీత్యా కలిగే మార్పులకు అనుగుణంగా మానసిక ఒత్తిళ్లను అధిగమించాలని ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు అన్నారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో జరిగిన కిషోర బాలికల ఆరోగ్యాభివృద్ధి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కిషోర బాలికలు, తల్లులకు ఆరోగ్యం, పౌష్టికాహారం, లైంగిక అవగాహన, పరిశుభ్రత, హింస, విముక్తి, జీవన నైపుణ్యాలపై రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ తోడుగా ఉండడం హర్షణీయమన్నారు. కోఆర్డినేటర్ భారతి మాట్లాడుతూ మండలంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, రాస్ కలసి 12గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి రూప్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ తేజశ్విని, డీపీఎంవో మునిసుబ్బిరామిరెడ్డి, సీహెచ్‌వో హైమావతి, ఉషారాణి, రాస్ సమన్వయకర్త భారతి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వరి సాగు


కోబాక గ్రామంలో వరి సాగు

ఏర్పేడు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు విస్తారంగా వరిసాగు చేస్తున్నారు. తొలకరి జల్లులు పడుతుండడంతో మోటార్ల ద్వారా పొలాలకు సాగునీటిని అందించి చదును చేసుకుని వరినాట్లు వేస్తున్నారు. రబీ సీజన్‌లో ఆర్ఎన్ఆర్ రకం వరి ధాన్యం బస్తా ధర రూ.2,100 నుంచి రూ.2,200 వరకు పలికింది. ఎకరాకు 35 నుంచి 40 వరి ధాన్యం బస్తాల దిగుబడి రావడంతో రైతులు మంచి ఆదాయాన్ని పొందారు. ఇలాగే ధరలు ఉంటాయని రైతులు ఆశించి ఆర్ఎన్ఆర్, 1010, బుడ్డలు తదితర రకాల వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 3,500 ఎకరాల్లో వరి సాగులో ఉంది.

అలరించిన ద్రౌపదీ స్వయంవరం



ఉత్సవ మూర్తి ఊరేగింపు, హరికథా గానం చేస్తున్న భాగవతారిణి రెడ్డెమ్మ

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీసమేత ధర్మరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భాగవతారిణి రెడ్డెమ్మ గానం చేసిన ద్రౌపదీ స్వయంవరం హరికథ అలరించింది. ఉదయాన్నే శ్రీస్వామి,అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ద్రౌపదీ స్వయంవరం, సాయంత్రం బకాసుర వధ నాటక ప్రదర్శన జరిగింది. ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు పూజారి రవి తీర్థప్రసాదాలు అందించారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి పాల్గొన్నారు.



పరవశం..తలకోన జలపాతం

ఎర్రావారిపాళెం మండలం అడవుల్లో కురిసిన వర్షాలకు స్థానికంగా ఉన్న జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతంలో పర్యాటకులు తడిసి ముద్దవుతున్నారు. తలకోనలోని శిరోద్రోణం, నెలకోన మడుగులో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. – భాకరాపేట

పచ్చదనం కాదు.. గుర్రపు డెక్క


కాళమనాయుడుపేట చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క

సత్యవేడు: కాళమనాయుడుపేట గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువులో గుర్రపు డెక్క దట్టంగా పెరిగి ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండంతో నీరు చెరువులోకి చేరుతోంది. గుర్రపు డెక్క మురిగి దుర్గంధం వెదజల్లుతోంది. చెరువు నీటిని పంటల సాగుకు రైతులు వినియోగిస్తారు. గుర్రపుడెక్క వేర్లు కాలువ నీటి నుంచి పొలాలకు చేరుతోంది. దీంతో పంట నాటిన కొద్ది రోజులకే పొలాల్లో గుర్రపుడెక్క మొలకెత్తుతండడంతో కలుపు తీతకు ఖర్చుల భారం అధికమవుతోంది. ప్రస్తుతం ఉపాధి పనులతో సుమారు రూ.10 లక్షలతో చెరువు కట్ట ఆధునీకరణ చేపట్టిన ఉపాధి అధికారులు, చెరువులోని గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.